AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
13-1-2026 (Tuesday) MAIN EDITION

## ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మర్రి మధ్య వాగ్వాదం



**అక్షరటుడే, హైదరాబాద్:** మేడ్చల్ జిల్లా మచ్చబొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనుల శంకు స్థాపన కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. వంతెనకు నిధులు తామే తీసుకువచ్చామంటూ ఇరువర్గాలు వాదోపవాదాలు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించారు.

## గిగ్ వర్కర్లకు ఊరట..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు అమలు చేస్తున్న 10 నిమిషాల డెలివరీని ఎత్తి వేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి మాండవీయ ఆదేశాలు జారీ చేశారు. కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా ప్రధాన ఆహార డెలివరీ, క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు '10 నిమిషాల' డెలివరీ నిబంధన తొలగించాలని మంగళవారం సూచించారు. డెలివరీ భాగస్వాముల భద్రత వేగం కంటే ముందు ఉండాలని నొక్కి చెప్పారు. కేంద్ర మంత్రి సూచనల మేరకు ప్రముఖ డెలివరీ ప్లాట్‌ఫాంలు బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటోలు '10 నిమిషాల డెలివరీ'పై వెనక్కి తగ్గాయి.

## నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సంబరాల్లో చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రాహ్మణి, దేవాంశ్, బాలకృష్ణ సతీమణి వసుంధర, తేజస్విని, శ్రీభరత్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పాక్‌చైనా ఒప్పందం చెల్లదు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని భారత ఆర్మీ చీఫ్ ద్వివేది వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## గరిష్ఠాలకు బంగారం, వెండి ధరలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయి. దేశ రాజధానిలో వెండి ధరలు కిలోకు రూ. 2,70,000 వద్ద జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌లో రూ. 2,87,000గా ఉంది. 24 క్యారెట్ల బంగారం కూడా 10 గ్రాములకు రూ. 1,42,250 వద్ద కొత్త రికార్డు స్థాయికి దూసుకెళ్లింది.



## గాదె ఇన్నయ్య ఇంట్లో ఎన్ఐఏ సోదాలు

**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అలియాస్ ఇన్నారెడ్డి ఇంట్లో ఎన్ఐఏ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. జాఫర్‌గఢ్‌లో ఇన్నయ్య ఆశ్రమం, ఇంట్లో తనిఖీలు చేశారు. మాజీ మావోయిస్ట్, సామాజిక కార్యకర్త గాదె ఇన్నారెడ్డిని ఎన్ఐఏ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జనగామ జిల్లా జాఫర్‌గడ్ లోని ఆయన నివాసంలో డిసెంబర్ 21న అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్ట్ కాతా రామచంద్రా రెడ్డి సంస్మరణ సభలో నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సంస్థకు మద్దతుగా గాదె ఇన్నారెడ్డి మాట్లాడారు. ఆయన రాజకీయ, సామాజిక అంశాలపై టీవీలకు ఇంటర్వ్యూలు ఇస్తుంటారు. పలు ఇంటర్వ్యూలలో మావోయిస్ట్‌లకు మద్దతుగా మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను ఆయన వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఎన్ఐఏ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు.



## ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇరాన్‌పై అమెరికా విరుచుకుపడుతోంది. దీనికి తోడు ఆ దేశంతో వ్యాపారాలు చేసే దేశాలను ఇరాన్‌కు దూరం చేయాలని చూస్తోంది. ఈ క్రమంలోనే యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు వేస్తున్నట్లు డోనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ తాజా నిర్ణయం తక్షణమే అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ట్రూత్‌లో ఈ నిర్ణయం పోస్టును చేశారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాల్లో తుర్కియే, చైనా, యూఏఈ, భారత్, ఇరాక్ ఉన్నాయి. ఇరాన నిరసనలపై యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ సైనిక చర్య చేపడతారని ఓ వైపు ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ తాజా నిర్ణయం వెలువడింది.



# పాక్‌కు వార్నింగ్

> పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పైకి ఉగ్రవాదులను ఉసిగొల్పితే గట్టిగా బదులిస్తామని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు అదుపులో ఉన్నాయన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పలు ఉగ్ర శిబిరాలు మళ్లీ యాక్టివ్ అయ్యాయని, వాటిపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు.
>
> —అక్షరటుడే, నేషనల్ డెస్క్

- ఉగ్రదాడి చేస్తే గట్టిగా బదులిస్తాం
- ఆపరేషన్ కొనసాగుతోంది
- ఉగ్రస్థావరాలపై నిఘా పెట్టాం
- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

భారత ఆర్మీ చీఫ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. భారత బలగాల సన్నద్ధతపై ఆయన వివరాలు వెల్లడించారు. ఉగ్రవాదులు భారత్‌పైకి దాడికి యత్నిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారత్‌లో భారీ ఉగ్రకుట్రకు ప్లాన్ చేసినట్లు ఇటీవల జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ ఆడియో విడుదలైన విషయం తెలిసిందే. భారత్‌లో దాడి చేయడానికి అనేక మంది సూసైడ్ బాంబర్లు సిద్ధంగా ఉన్నారని సమచారం. ఈ క్రమంలో ఆర్మీ చీఫ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా కొనసాగుతుందని స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి అదుపులోనే ఉందన్నారు.

### సిద్ధంగా ఉన్నాం

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి ప్రయత్నించినట్లయితే, సాయుధ దళాలు భూ కార్యకలాపాలను ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ జరిగిన 88 గంటల్లో సంప్రదాయ స్థలాన్ని విస్తరించడానికి సైన్యం సమీకరణ ఎంతగా ఉందో మీరు చూశారన్నారు. పాకిస్థాన్ ఏదైనా తప్పు చేస్తే తాము భూ కార్యకలాపాలను ప్రారంభించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం ప్రతిస్పందన క్షేత్ర స్థాయిలో భిన్నమైన వాస్తవికతను ప్రదర్శించిందన్నారు.

### జమ్మూకశ్మీర్‌లో..

జమ్మూ కశ్మీర్ వెంబడి పరిస్థితి సున్నితంగా ఉన్నప్పటికీ, అది పూర్తిగా నియంత్రణలో ఉందని ఆర్మీ చీఫ్ తెలిపారు. 2025లో 31 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. వీరిలో 65 శాతం మంది పాకిస్థాన్‌కు చెందిన వారన్నారు. ఆపరేషన్ మహాదేవ్‌లో హతమైన పహల్గామ్ దాడికి పాల్పడిన ముగ్గురు కూడా వీరిలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం క్రియాశీల స్థానిక ఉగ్రవాదుల సంఖ్య సింగిల్ డిజిట్‌కు పడిపోయిందని, ఉగ్రవాదుల రిక్రూట్‌మెంట్లు దాదాపుగా లేవని చెప్పారు. పీవోకేలో దాదాపు ఎనిమిది శిబిరాలు ఇప్పటికీ క్రియాశీలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. వాటిపై నిశితంగా నిఘా ఉంచామని వెల్లడించారు.

### 100 మంది మృతి

గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్ మే 7న పాక్‌పై దాడులు చేసింది. పాకిస్థాన్, పీవోకే లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఘటనలో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. అనంతరం పాక్ డ్రోన్లు, క్షిపణులతో భారత్‌పై దాడులు చేయగా.. భారత గగనతల రక్షణ వ్యవస్థ వాటిని అడ్డుకుంది. అనంతరం పాక్‌లోని పలు ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేపట్టింది. ఈ క్రమంలో మే 10న పాక్ కాల్పుల విరమణకు ప్రతిపాదించింది. దీంతో రెండు దేశాలు సీజ్‌ఫైర్‌కు అంగీకరించాయి.

## సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌అన్నారు. ఆయన పలు సంఘాల నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన లో సికింద్రాబాద్ పరిధిలోని పోలీస్ స్టేషన్లు, డివిజన్లను మల్కాజిగిరి జోన్ కిందకు చేర్చడంపై తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ నగరంలో వార్డుల విభజన చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే పోలీస్ కమిషనరేట్లలో సైతం మార్పులు చేసింది. ఈ క్రమంలో ఇటీవల తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌ను విభజిస్తే ఊరుకోమన్నారు. అయితే దానిపై సోమవారం సీఎం స్పందించారు. సికింద్రాబాద్‌ను తాము ఏం మార్చడం లేదని, రాచకొండ కమిషనరేట్ పేరు మాత్రమే మార్చామన్నారు. దీనిపై తాజాగా తలసాని స్పందించారు. సికింద్రాబాద్ ముక్కలు కాకుండా అందరం కలిసి పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 17 సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే బీజేపీ పోటీ: రాంచందర్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. తమ పార్టీకి ఎవరైనా మద్దతిస్తే స్వాగతిస్తామన్నారు. జనసేన రాజకీయ పార్టీ అని.. పోటీ చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎదుగుదలను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అంగీకరించకుండా ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గులాబీ పార్టీకి అభ్యర్థులే దొరకలేదని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించామని.. మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని తెలిపారు. ఎంపీలు వారి నివాసాల్లో సమావేశం కావడంలో తప్పేముందన్నారు. నాకు వ్యతిరేకంగా భేటీ అయ్యారన్న విషయంపై సమాచారం లేదని చెప్పారు.

## రాజేంద్రనగర్‌లో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరం లోని రాజేంద్రనగర్ లో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బద్వేల్‌లోని ప్లాస్టిక్‌లో పరిశ్రమలో మంటలు చెలరేగాయి. బద్వేల్‌లోని కిస్మత్‌పూర్ వంతెన సమీపంలో ఉన్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌లో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ప్లాస్టిక్ పరిశ్రమ కావడంతో మంటలు భారీగా వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అక్కడి నుంచి దూరంగా పరులుగు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

## లారీ బోల్తా.. హైదరాబాద్ విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ - విజయవాడ హైవేపై లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ కట్టెల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. రోడ్డుపై చెల్లాచెదురుగా కట్టెలు పడిపోయాయి. దీంతో ఎన్‌హెచ్-65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు 6 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అసలే సంక్రాంతి పండుగ కావడంతో భారీగా వాహనాలు విజయవాడ వైపు వెళ్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదం జరిగి ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పిన మీనాక్షి చౌదరి



టాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకెళ్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి. యంగ్ హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె నటించిన తాజా గ్రామీణ నేపథ్య కుటుంబ కథా చిత్రం 'అనగనగా ఒక రాజు' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జరిగిన ఒక ఈవెంట్‌లో మీనాక్షి సరదాగా మాట్లాడిన మాటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా యాంకర్ వేసిన ప్రశ్నకు స్పందించిన మీనాక్షి, తన జీవిత భాగస్వామి గురించి కొంచెం వినూత్నంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. తనకు సినిమాలంటే ఇష్టం కాబట్టి సినిమాలపై ఆసక్తి ఉన్న వ్యక్తి అయితే బాగుంటుందని చెప్పారు. అలాగే నటుడు, డాక్టర్ లేదా అందాల పోటీల్లో పాల్గొన్న వ్యక్తి కాకూడదంటూ చమత్కారంగా వ్యాఖ్యానించారు.

– అక్షరటుడే, సినిమా డెస్క్

## చైనా మాంజాతో మరో ఇద్దరికి గాయాలు

**అక్షరటుడే, హైదరాబాద్:** చైనా మాంజా వాడొద్దని పోలీసులు ఎంత చెబుతున్నా ప్రజలు వినడం లేదు. ప్రమాదకరమైన ఆ దారంతోనే పతంగులు ఎగుర వేస్తున్నారు. ఈ క్రమంలో చైనా మాంజాతో పలువురు గాయాల పాలవుతున్నారు. తాజాగా విధులకు వెళ్తున్న ఏఎస్సై మెడకు చైనా మాంజా చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో నాగరాజు ఏఎస్సైగా పని చేస్తున్నాడు. ఉప్పల్‌లోని తన నివాసం నుంచి బైక్‌పై డ్యూటీకి బయలు దేరాడు. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తుండగా.. చైనా మాంజా మెడకు చుట్టుకొని కోసుకుపోయింది. తీవ్రంగా గాయపడ్డ ఆయనను స్థానికులు కామినేని ఆస్పత్రికి తరలించారు. మరోవైపు రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో చైనామాంజాతో మహిళ గాయపడింది. అల్మాస్ గూడలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు మాంజా చుట్టుకుంది. దీంతో ఆమె కాలుకు తీవ్ర గాయం కాగా.. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.